andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 । కనిష్ఠం 18.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 19 జనవరి 2024



శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు

దిలావర్‌పూర్, జనవరి 18 : శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామాల్లో బూత్ లెవల్ అధికారుల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సీఎంఆర్ అవకతవకలపై కలెక్టర్ కొరడా



నిర్మల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత రెండు మూడు సంవత్సరాల నుంచి సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్, బియ్యం రికవరీలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ కొరడా ఝుళిపిస్తున్నారు. కొంతమంది రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి సీఎంఆర్ వ్యవహారంలో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. 2021-2022 సంవత్సర ఖరీఫ్, రబీ నుంచి మొదలుకొని ఈ సంవత్సరం ఖరీఫ్ వరకు మొత్తం ఐదు సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యం వ్యవహారంలో రైస్‌మిల్లర్లు పథకం ప్రకారం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో ప్రభుత్వం సీఎంఆర్ బియ్యం రికవరీ విషయంలో హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా పలుసార్లు గడువును కూడా పెంచింది. అయితే రైస్‌మిల్లర్లు తమకున్న పలుకుబడి పరపతితో సంబంధిత అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి బియ్యం రికవరీ విషయంలో ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేసినట్లు విమర్శలున్నాయి. అయితే అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా రైస్‌మిల్లర్లు ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి తమకు కేటాయించిన ధాన్యం కోటా లెక్కలను తలకిందులు చేస్తూ అధికారులనే బురిడి కొట్టిస్తున్నారంటున్నారు. ఇందులో భాగంగానే తమ మిల్లింగ్ కేపాసిటీ కారణం చూపి ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా తమ వద్దనే నిల్వ ఉంచుతూ కృత్రిమ లెక్కలు సృష్టిస్తున్నారంటున్నారు. ఈ కృత్రిమ లెక్కల కారణంగా అటు ధాన్యం నిల్వల్లో పెద్దఎత్తున తేడాలు ఏర్పడినట్లు విమర్శలున్నాయి. అలాగే సీఎంఆర్ బియ్యం వ్యవహారంలో కూడా లెక్కలను తారుమారు చేసి ఖరీఫ్, రబీసీజన్‌ల కోటాలను తలకిందులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే గత కలెక్టర్‌లు ఈ విషయంలో ఆశించిన మేర చర్యలు తీసుకోకపోవడం రైస్‌మిల్లర్లకు వరంగా మారింది. అధికారుల ఉదాసీన వైఖరిని ఆసరాగా చేసుకున్న రైస్‌మిల్లర్లు ఇష్టానుసారంగా ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించి పొంతన లేకుండా సీఎంఆర్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖకు అప్పజెప్పారు. అయినప్పటికి రైస్‌మిల్లర్లు చెల్లించిన బియ్యం కన్నా నాలుగింతల ధాన్యం మిల్లర్ల వద్దనే ఇప్పటికి నిల్వ ఉన్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే వాస్తవానికి ఆ ధాన్యాన్నంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించి ముందస్తుగానే సొమ్ము చేసుకున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ సీఎంఆర్ బియ్యంపై ప్రత్యేకదృష్టి సారించి పలుసార్లు అటు రైస్‌మిల్లర్లు ఇటు అధికారులతో సమీక్షలు నిర్వహించి అవకతవకలపై ఆరా తీశారు. ప్రభుత్వం గడువును పెంచుతున్నప్పటికీ మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని కోటా ప్రకారం అందివ్వకపోవడం పట్ల కలెక్టర్ సీరియస్ అయ్యారు. దీంతో చిట్టచివరగా ఈ నెల 31లోగా సీఎంఆర్ బియ్యాన్ని మొత్తం తిరిగి చెల్లించాలంటూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. 31వ తేదీ దాటినట్లయితే సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వని రైస్‌మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా ఆస్తులు సైతం జప్తు చేస్తామంటూ హుకూం జారీ చేశారు. కలెక్టర్ హెచ్చరికలతో రైస్‌మిల్లుల యజమానుల్లో దడ మొదలైందంటున్నారు. అయితే రొటీన్‌గా కాకుండా ప్రస్తుత కలెక్టర్ హెచ్చరికలు రైస్‌మిల్లుల యజమానులపై ఏ మేరకు ప్రభావం చూపుతాయోనన్న ఆసక్తి అంతటా నెలకొంటోందంటున్నారు.



రైస్‌మిల్లుల్లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)

- రికవరీపై రాష్ట్ర సర్కారు సీరియస్‌గా దృష్టి
- జిల్లాలో ఆకస్మికంగా రైస్‌మిల్లుల తనిఖీలు
- 31లోగా రికవరీ పూర్తయ్యే దిశగా చర్యలు
- ఇప్పటికే మిల్లర్లకు హెచ్చరికలు జారీ
- రంగంలోకి స్పెషల్ టీంలు

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో దడ

జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సీఎంఆర్ అవకతవకల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటూ మిల్లర్లకు వార్నింగ్‌లు జారీ చేస్తుండడం దుమారం రేపుతోంది. గతానికి భిన్నంగా ప్రస్తుత కలెక్టర్ కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేస్తుండడం చర్చకు తావిస్తోందంటున్నారు. సారంగాపూర్ మండలంలోని చించోలి వద్ద ఉన్న ఓ రైస్‌మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సీఎంఆర్ వ్యవహారంలో జరుగుతున్న అవకతవకలను గుర్తించారు. అలాగే సీఎంఆర్ ధాన్యంపై నెలకొన్న నిర్లక్ష్యాన్ని సైతం కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో పాటు కలెక్టర్ భైంసా ప్రాంతంలోని కొన్ని రైస్‌మిల్లులను సైతం ఆకస్మికంగా తనిఖీ చేసి కొరడా ఝుళిపించారు. కలెక్టర్ తనిఖీలతో హడలెత్తిపోతున్న మిల్లర్లు అన్ని సజావుగా ఉన్నట్లు చూపేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తనతో పాటు కలెక్టర్ అడిషనల్ కలెక్టర్‌లను అలాగే సివిల్ సప్లయ్ అధికారులు, రెవెన్యూ అధికారులను సైతం టీంలుగా ఏర్పాటు చేసి రైస్‌మిల్లుల్లో వరుస తనిఖీలు చేపట్టేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించారు.

గడువులోగా రికవరీ జరిగేనా..?

కాగా సీఎంఆర్ బియ్యం రికవరీ కోసం ఈ నెల 31వ తేదీ వరకు మరోసారి గడువును పెంచారు. అయితే ఈ సారి పెంచిన గడువులోగా మొత్తం సీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ బియ్యం రికవరీ జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కేవలం 13 రోజులు మాత్రమే గడువు ఉన్న కారణంగా ఈ గడువులోగా మొత్తం సీఎంఆర్ రికవరీ జరగడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2021-2022 యాసంగికి సంబంధించిన సీఎంఆర్ బియ్యంతో పాటు 2022-2023 ఖరీఫ్‌కు సంబంధించి 43వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అలాగే 2022-2023 యాసంగికి సంబంధించి 1,04,061 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యంను ప్రభుత్వం రికవరీ చేయాల్సి ఉందంటున్నారు. అయితే నెలల తరబడి పూర్తి కాని రికవరీ వ్యవహారం కేవలం 13 రోజుల్లో పూర్తవ్వడం సాధ్యమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి సీఎంఆర్ బియ్యం అవకతవకల వ్యవహారం గడువు పూర్తయిన తరువాత ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న అంశమే ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది.

● రికవరీపై సీరియస్‌గా దృష్టి



సీఎంఆర్ బియ్యం రికవరీ విషయంలో సీరియస్‌గా దృష్టి సారించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు మరోసారి గడువును పెంచాం. గడువులోగా మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే పలుసార్లు గడువును పెంచాం. గడువును నిర్లక్ష్యం చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం.

● ఆశిష్ సంగ్వాన్ (జిల్లా కలెక్టర్)


తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక ఎన్టీఆర్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఐకే రెడ్డి, నాయకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 18 : మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్‌లోని ఎన్‌టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసి రాజకీయాలను మలుపు తిప్పారన్నారు. అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రజల్లో చైతన్యం నింపారన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే రాంరావు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ముథోల్, జనవరి 18 : నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన ముథోల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంజూరైన ముథోల్ నియోజకవర్గం ఆయా మండలాలకు మంజూరైన 369 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు దశల వారీగా మంజూరవుతాయని తెలిపారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముథోల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ముథోల్ నుండి పంచగుడి వరకు డబుల్ రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న చేరికలు

భైంసా, జనవరి 18 : నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. గురువారం భైంసా, తానూర్, కుబీర్ మండలాల పరిధిలో పలు గ్రామాల బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సమక్షంలో వీరందరూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతియే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ పాటు పడుతోందని పేర్కొన్నారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు సముచిత స్థానం కల్పిస్తామని వెల్లడించారు.

రేపు సాయిబాబా జాతర సన్నాహక సమావేశం

ఖానాపూర్, జనవరి 18 : పట్టణంలోని వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న జాతరపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 10 గంటలకు సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నందున ఈ సమావేశానికి ఆలయ కమిటీ సభ్యులతో భక్తులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కూరగాయలను కొనుగోలు చేస్తున్న జిల్లా అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 18 : జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్‌లో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకల నిర్వహణపై అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌ను ప్రారంభించుకున్న తర్వాత మొదటిసారి ఇక్కడ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్యం, విద్యుత్, డీఆర్‌డీవో, ఉద్యానవన, తదితర అన్ని శాఖల సమన్వయంతో స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ భవాన్ని పెంపొందించే విధంగా ఉండాలన్నారు. ఈ వేడుకలకు జిల్లా అధికారులు, సిబ్బంది అందరూ విధంగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో, ఆర్డీవోలు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలి

నిర్మల్ టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్‌సీ వివరాలు, రిజిస్టర్‌లో నమోదు, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, నార్మల్ డెలివరీలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనీమియాసే నిర్మల్ ముక్త్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని, ఆరు హామీల్లో వైద్యానికి సంబంధించిన ఆరోగ్యశ్రీ పరిమితి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారికి పేదలు ఎక్కువగా ఉంటారని, పేదలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిజరిన్ కేసులను తగ్గించి నార్మల్ డెలివరీలను పెంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈసారి సమావేశానికి అన్ని సమాచారాలతో రావాలని, అన్ని ఆసుపత్రులలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలను కొనుగోలు చేసిన కలెక్టర్

నిర్మల్ రూరల్ : మండలంలోని కొండాపూర్ గ్రామశివారులో నిర్మల్ మండల సమాఖ్య సమీకృత వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల పంట లు పండిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో బీట్‌రూట్, వివిధ రకాల కూరగాయలను డీఆర్‌డీవో విజయలక్ష్మి అమ్మకాలు జరిపారు. అయితే జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు, సిబ్బంది కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య సమీకృత వ్యవసాయ క్షేత్ర సభ్యులను అభినందించారు.

పదవీ కాలం పెంచి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డీసీసీ అధ్యక్షుడికి సర్పంచ్‌ల ఫోరం వినతి పత్రం అందజేత

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 18 : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పెంచాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. గత ఏడాదిన్నర నుండి ఎస్ఎఫ్‌సీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు జమ చేయడం లేదన్నారు. కోవిడ్ కారణంగా చెక్ పవర్ ఇవ్వకపోవడంతో రెండున్నర సంవత్సరాల సమయం వృధా అయిందని, సర్పంచ్‌ల పదవీ కాలం ముగిస్తే ప్రత్యేక అధికారులను నియమించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. ఇందులో ఆయా గ్రామాల సర్పంచ్‌లు భూమేష్, హన్మ గౌడ్, ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

నిర్మల్ టౌన్ : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్ తెలంగాణ ప్రజల తరఫున ఉద్యమించిన నాయకుడని, ఉద్యమ సమయంలో ప్రజల వైపు ఉన్న వ్యక్తి అని, అద్దంకి దయాకర్‌పై అనేక ఉద్యమ కేసులు ఉన్న విషయం గుర్తు చేస్తూ ఉద్యమకారుడిని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రి వర్గంలోకి తీసుకుంటుందని భావించామని, కానీ గురువారం ప్రకటించిన ఎమ్మెల్సీలో అద్దంకి దయాకర్ పేరు లేకపోవడం అనేది చాలా బాధకరమన్నారు. మాల మహానాడు సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దయాకర్‌కి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్. అశోక్, దాసరి రాజన్న, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నేత శ్యామ్, బేర తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలువ భూమిని సర్వే చేసిన అధికారులు

నర్సాపూర్(జి), జనవరి 18 : మండల కేంద్రంలోని దేవుని చెరువు గొలుసుకట్టు కాలువలు భూములను కాపాడాలనాని మండల కేంద్రంలోని ఆయకట్టు రైతులు మంగళవారం మండల తహసీల్దార్ సోమ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు 635, 638 సర్వే నంబర్లలో ఆయకట్టు రైతుల సమక్షంలో సర్వేయర్ మోహన్‌క్రిష్ణ ఆధ్వర్యంలో పాతనక్షా ప్రకారం కాలువ భూమి ఉందని నిర్ధారించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోమ శ్రీనివాస్ మాట్లాడుతూ వెంచర్ నిర్వాహకుడికి రెండు రోజుల సమయంలో వేరే వైపు నుంచి కాలువను మళ్లింపు చేసి స్థలం కేటాయిస్తామని తెలపడంతో అందుకు అనుమతి ఇవ్వలేదు. పూడిక తీత పనులకు అడ్డుపడవద్దని తెలిపారు. లేదంటే కాలువ పనులకు అడ్డుపడితే నాలా అనుమతి రద్దు చేస్తామని హెచ్చరించారు.

గతం నుంచి మ్యాప్ ప్రకారం దేవుని చెరువు గొలుసు కట్టు కాలువ ఉండేది వేరే వైపు నుంచి మళ్లింపు చేస్తే ఊరుకునేది లేదని ఆయకట్టు రైతు అప్పాల రాజగంగుబాయి అన్నారు. ఎప్పటిలాగే నీరు ప్రవహించాలన్నారు. గతంలో కూడా ఊర చెరువు ప్రాంతంలో వెంచర్ ఏర్పాటు చేసి కాలువను పూడ్చి వేయడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఇరిగేషన్ ఏఈఈ సోన్‌కాంబ్లే గంగా ధర్ వివరించారు. ఎవరైనా అనుమతులు లేనిదే కాలువన పూడ్చివేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని అన్నారు.



జాయింట్ సర్వే చేస్తున్న అధికారులు

సంక్షిప్త సమాచారం

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

నిర్మల్ అర్బన్, జనవరి 18 : 12 ఏళ్ల బాలికపై అత్యాచార కేసులో.. నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రత్యేక ఫోక్సో కోర్టు న్యాయాధికారి గురువారం తీర్పు చెప్పారు. జిల్లా కోర్టు సమన్వయ అధికారి సక్రియా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018 లో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గవత్వాడి గ్రామానికి చెందిన కాడే అలియాస్ కాలే కొండిబా అలియాస్ బాలు అనే వ్యక్తి భైంసా మండలంలో పశువుల కాపరిగా పని చేసేవాడు. అదే మండలంలో వ్యవసాయ పనులు చేసుకుని జీవనం గడుపుతున్న మరో కుటుంబానికి చెందిన బాలికపై ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో భైంసా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటివరకు 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా.. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం జిల్లా ప్రత్యేక ఫోక్సో కోర్టు ప్రధాన ప్రత్యేక న్యాయాధికారి ఏ. కర్ణ కుమార్ తీర్పు వెలువరించారు. నేర నిర్ధారణ రుజువు కావడంతో నిందితుడు కాడే అలియాస్ కాలే కొండిబా అలియాస్ బాలు అనే వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కుబీర్, జనవరి 18 : మండలంలోని బాకోట్ గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివాజీ(32) అనే వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారి వివరాల ప్రకారం... తానూర్ మండలం మసల్గా గ్రామానికి చెందిన శివాజీ అత్తగారింటికి వచ్చి భార్యను తీసుకొని స్వగ్రామమైన మసల్గాకు వెళ్లేందుకు బస్టాండ్ వద్దకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా భైంసా డిపోకు చెందిన ఏపీ01జెడ్0020 నెంబరు గల ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. తన భర్త కండ్ల ముందే మృతి చెందడం చూసిన భార్య యొక్క రోదిస్తున్న తీరును చూసి అక్కడి గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామ నిర్వహించారు. మృతుడి భార్య రంజన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షరీఫ్ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



లోకేశ్వరం, జనవరి 18 : మండలంలోని పోట్‌పెల్లి(బి) గ్రామానికి చెందిన బి.గణేష్(23) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు చిన్నప్పటి నుండి మతిస్థిమితం సరిగ్గా లేక గ్రామంలో అప్పుడప్పుడు పిచ్చి చేష్టలు చేసేవాడు. కొన్ని సంవత్సరాల క్రితం కూడా మృతుడు ఆత్మహత్య ప్రయత్నం చేయగా హాస్పిటల్‌లో చూపించారు. అయితే గత ఆరు నెలల నుండి మతిస్థిమితం ఎక్కువై మృతుడు మానసిక స్థితి బాగోలేక గురువారం ఉదయం 10 గంటల సమయంలో తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని మృతుడి తండ్రి నర్సయ్య తెలిపారు. నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

అద్దంకి దయాకర్‌కి ఎమ్మెల్సీ ఇవ్వాలి

● ఖానాపూర్ మాల మహానాడు కమిటీ డిమాండ్



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

ఖానాపూర్, జనవరి 18 : కాంగ్రెస్ పార్టీ నేత, తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్‌కి వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మాల మహానాడు కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు కమిటీ జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్న ఉద్యమకారుడు దయాకర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రి వర్గంలోకి తీసుకుంటుందని అనుకుంటున్నామన్నారు. కానీ కేవలం దళితుడు అనే కారణంతోనే అగ్రవర్ణాల నాయకులు అద్దంకి దయాకర్‌ను పక్కనపెట్టే ప్రయత్నాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మాల మహా నాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు రాసమళ్ళ అశోక్, మాల మహానాడు జిల్లా కన్వీనర్ నేత శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు బేర తిరుమలేష్, ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఎం. సతీష్, రెడ్డిమల్ల దాస్, మగ్గిడి సురేష్, ద్యావతి దామోదర్, కొంపెల్లి రాజేందర్, అభిషేక్, తదితరులున్నారు.

గండి రామన్న ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభం

● రూ. 51,116 విరాళాన్ని అందజేసిన నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ అర్బన్, జనవరి 18 : పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో గురువారం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు హాజరై నిత్యాన్నదాన ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం భక్తులతో కలిసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న శ్రీహరి రావుకు ఆలయ కమిటీ అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు, వేద పండితులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి శ్రీహరిరావు మాట్లాడుతూ.. ఇక్కడి సాయిబాబా ఆలయంతో పాటు ఆలయ పరిసరాలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు రావడం మంచి ఆలోచన అన్నారు. కాగా నిత్యాన్నదానం కోసం తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శ్రీహరిరావు రూ. 51,116లను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రామ్ రెడ్డి, కొట్టే శేఖర్, బురాజ్, తదితరులతో పాటు సాయి దీక్ష సేవా సమితి సభ్యులు పూదరి నరహరి, జైపాల్ రెడ్డి, ఉప్పుల నందు, సోమేష్, కోల శంకర్, దశ గౌడ్, జొన్నల మనోహర్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ తవ్వకాలు

● లక్ష్మణచాందలో నిలిచిన ఆర్టీసీ బస్సు


మల్లాపూర్‌లో ఇష్టారాజ్యంగా పైప్‌లైన్ తవ్వకాలు ఇలా..

లక్ష్మణచాంద, జనవరి 18 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్వడంతో గురువారం ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. స్థానిక సర్పంచ్‌కు, గ్రామస్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నడి రోడ్డుపై తవ్వకాలు చేసి వదిలేశారని స్థానిక సర్పంచ్ రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల ఆర్టీసీ బస్సు రాకపోకలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లాపూర్‌తో పాటు మునిపెల్లి, మాచాపూర్ గ్రామాల ప్రజలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు పూర్తి చేసి ఆర్టీసీ బస్సు ప్రయాణం కొనసాగేలా చూడాలని గ్రామస్థులు కోరారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దిలావర్‌పూర్, జనవరి 18 : ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యత అనే అంశంపై గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఓటు నమోదు అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్వీప్ కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటరు నమోదు, ఓటు హక్కు, ఓటు విలువపై విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పట్వారీ నవీన్ పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

శిశు మందిర్ భవన నిర్మాణ పనుల పరిశీలన

ముథోల్, జనవరి 18 : ముథోల్ మండల కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలను హైకోర్టు న్యాయవాది నరేష్ రెడ్డి సందర్శించి పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మితమవుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. నూతన భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. వీరి వెంట ఎన్ఆర్ఐ అయ్యన్నగారి శ్రీకాంత్, నిర్మల్ జిల్లా సహ సంచాలక్ సాదుల కృష్ణదాస్, ఆదిలాబాద్ విభాగ్ సహ కార్యదర్శి సరుకొండ దామోదర్, హైకోర్టు న్యాయవాది నిమ్మల ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ అయ్యన్నగారి శ్రీకాంత్ రూ. 27,000ల చెక్కును భవన నిర్మాణ పనుల నిమిత్తం విరాళం అందించారు.



ఉట్నూర్‌లో ఎన్టీఆర్‌కు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ఎన్‌టీ రామారావుకు ఘన నివాళి

ఉట్నూర్, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం ఉట్నూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పవార్‌దేవిదాస్, మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి పులిశెట్టి శ్రీనివాస్, జన్నారం, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్, బీజేపీ ఉట్నూర్ మండల ఉపాధ్యక్షుడు కాల్వరవిఆరెపల్లి గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు కిరణ్, మరికంటి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేద ప్రజలకు చేసిన అభివృద్ధి, ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజల మన్ననలను పొందారన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారుఇందులో పార్టీ కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, పార్లమెంట్ కార్యదర్శి గంగసరపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పతిహార ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు తోకల లస్మన్న, మండల నాయకులు ఆరే.రాజన్న, కె.నరేందర్, మహిళ నయకురాలు అంబుబాయి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథానికి వీడ్కోలు

ఉట్నూర్, జనవరి 18: ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభంకానున్న మెస్రం గిరిజనుల నాగోబా జాతర ప్రచారరథానికి మండలంలోని సాలెవాడ (బి)లో మెస్రం గిరిజనులు గురువారం వీడ్కోలు పలికారు. ఈనెల 14నుంచి కిస్లాపూర్ నాగోబా ఆలయం ప్రాంగణం నుంచి నాగోబా జాతరకు మెస్రం గిరిజనులు తరలిరావాలంటూ పటేల్ వెంకట్రావు ఆదేశాల మేరకు ప్రారంభమైన ప్రచారరథం(చకడ) బుధవారం రాత్రికి సాలెవాడకు చేరుకుని బస చేశారు. గురువారం ఉదయమే సాలెవాడ(బి) నుంచి ఇంద్రవెల్లి మండలం పొల్లుగూడ వైపు వెళ్లింది. ప్రచార రథాన్ని మెస్రం గిరిజనులు తమ ఆచార సంప్రదాయాలు పూర్తి చేసుకుని కచడపై వచ్చిన ప్రధాన్ దాదారావు, బొద్దుగూడ కోసు కటోడలను సాగనంపారు. ఈ సందర్భంగా కోసుపటేల్ మాట్లాడుతూ ప్రచార రథం ఆదివారం నాటికి కిస్లాపూర్‌కు చేరుకుంటుందని అన్నారు. 21న మిశ్రమంలో కిస్లాపూర్‌లో పూజలు నిర్వహించి గంగాజలం కోసం కాలినడకన బయలుదేరడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయకి షేకు, మేస్రం కోసేరావు, కటోడ, మేస్రం నాగోరావు, మెస్రం యోగేశ్, లక్కేరావు, మలుకులు, తదితరులు పాల్గొన్నారు.



పొల్లుగూడకు బయలుదేరిన మెస్రం వంశీయుల ప్రచార రథం

'లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం'

తలమడుగు, జనవరి 18: మహారాష్ట్ర నుంచి అక్రమంగా వచ్చి తెలంగాణలో లబ్ధి పొందుతున్న లంబాడీలని ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేష్ అన్నారు. గురువారం మండలంలోని జరిపూనగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన తుడందెబ్బ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సందర్భంగా తుడందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ అనుకొని ఉన్న పరిసరాల మండలాలైనా తలమడుగు, తాంసి, బేల, జైనథ్, భీంపూర్ ఈ మండలాల్లో ఈ మధ్య కాలంలో మహారాష్ట్ర నుంచి వలసలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. ఇప్పుడు ఇస్తున్న ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకంలో మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన లంబాడాలు అక్రమంగా వచ్చి 6గ్యారెంటీ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తు వల్ల మహారాష్ట్ర వాళ్లకు ఆధార్‌కార్డు ఇస్తే ఆదివాసులు చాలా నష్టం జరగాల్సిన పరిణామాలు చాలా ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వాధికారులకు తహసీల్దార్లకు విజ్ఞప్తి చేసేది ఒక్కటే మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారికి వారి పూర్తి వివరాలు తెలుసుకుని ఆరు గ్యారెంటీలకు వారి దరఖాస్తులు స్వీకరించాన్నారు. ఇందులో జంగిళ్ల పోచన్న, గోడం భుజంగరావు, మేస్రం విలాస్,పంద్రంరమేష్, తొడసం హేమంద్రఫ్, పెందూర్ మాదవ్, గోడంఈశ్వర్, నీలగిరి ఆశోక్ తదితరులున్నారు.

ప్రతీ రైతు పంట నమోదును విధిగా చేయించుకోవాలి : ఏవో

జైనథ్, జనవరి 18: మండలంలోని 42 గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా గ్రామాలకు సంబంధించిన రైతులు యాసంగి పంటలను విధిగా పంటల నమోదును చేసుకోవాలని జైనథ్ మండల వ్యవసాయ అధికారి ఎ.వివేక్‌కుమార్ అన్నారు. పంటల నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారంజైనథ్ మండలంలోని సిర్సన్న గ్రామంలోని శనగ పంటలో నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో పాల్గొని రైతులకు తగుసూచనలు అందించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతు ప్రస్తుత యాసంగి పంట అయిన శనగ పంటలో ఎండు తెగులు, వేరుకుళ్ల నివారణకురైతులకు సూచనలు అందించారు. దాని నివారణకు గాను 600 గ్రాముల బ్లూకాపర్‌ను 25 గ్రాముల ప్లాంటమైసిన్ 200 లీటర్లలో కలిసి మొక్కభాగం పూర్తిగా తడిచే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిర్సన్న గ్రామ సర్పంచ్ ఎం.ఊశన్న, బోరజ్ క్లస్టర్ వ్యవసాయ విస్తర్ణాధికారి కొర్రి రమణాలతో పాటు గ్రామశనగ పంట రైతులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తాంసి, జనవరి 18: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన షేక్‌దాదా(32) అనే వ్యక్తి ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు తాంసి ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి షేక్ ముస్తాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పులి దాడిలో ఆవు మృతి

బజార్‌హత్నూర్, జనవరి 18: మండలం పరిధిలోని చినుమియా తండా గ్రామం పరిసర ప్రాంతంలో చిరుత పులి దాడిలో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక గ్రామస్థులు, ఫారెస్టు బీట్ అధికారి లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మారుమూల గ్రామమైన చినుమియా తండా గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రములో గంగాపూర్ గ్రామానికి చెందిన సుధాం అనే రైతుకు చెందిన ఆవులను పశువుల కాపరి మేత మేపడానికి తీసుకెళ్ళిన సమయంలో చిరుతపులి దాడి చేసి చంపిననట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా శ్యాంరావు గూడా గ్రామానికి చెందిన చిత్రు అనే రైతుకు చెందిన ఆవుపై దాడికి ప్రయత్నించగ ప్రాణాలను కాపాడుకుందని పేర్కొన్నారు. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.60వేలకు పైగా ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కోలాహలంగా సాగుతున్న ఐఎస్‌ఎల్ క్రీడలు

● ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఇంటర్ సొసైటీ లీగ్ క్రీడా పోటీలు ● పెద్దసంఖ్యలో తరలివచ్చిన క్రీడాకారులు

ఉట్నూర్, జనవరి 18: మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలు కోలాహలంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని ఏడు సొసైటీలకు చెందిన విద్యార్థులతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఐఎస్ఎల్ పోటీలలో 3500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కొమురం భీం క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆదిలాబాద్, నిర్మల్ గిరిజన సంక్షేమ జిల్లా క్రీడా అధికారులు కోరెడ్డి పార్థసారథి, బుక్యరమేష్‌లు నేతృత్వం వహిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ దిలీప్‌కుమార్, చందన, రమాదేవితో పాటు మంచిర్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మడావి గంగారాం తదితరులు పర్యవేక్షిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, హాకీ, షాట్‌పుట్, అర్చరీ, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్ తదితర 17 రకాల ఈవెంట్స్ పోటీలు నిర్వహిస్తున్నారు.

● అథ్లెటిక్స్ విజేతలకు పతకాలు

ఉట్నూర్‌లో నిర్వహిస్తున్న ఐఎస్ఎల్ పోటీలలో అథ్లెటిక్స్ విజేతలకు బంగారు, వెండి, కాంస్య పథకాలను అందిస్తున్నారు. 14ఏళ్ల బాలుర వంద మీటర్ల పరుగు పందెంలో జాతర్ల ఆదర్శ విద్యార్థి రాథోడ్ కార్తిక్ బంగారు పతకం, ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి రాథోడ్ విక్రం వెండి పథకం, తెలంగాణ ఆదర్శ రెసిడెన్షియల్ స్కూల్ గాంధారి విద్యార్థి నేనావత్‌శ్రీను కాంస్య పథకం సాధించుకున్నారు. ఇదే మాదిరి 14 ఏళ్ల బాలుర విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి కొడప పరశురాం బంగారు పతకం, హుజురనగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసెడెన్షియల్ స్కూల్స్ విద్యార్థి ప్రవీణ్ వెండి పతకం, భద్రాద్రి కొత్తగూడెం గిరిజన సంక్షేమ ఆదర్శ పాఠశాల విద్యార్థి చరణ్‌కాంస్య పథకం, 14ఏళ్ల బాలుర విభాగం సార్ట్‌పుట్ పోటీలలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు చెందిన వెల్ఫేర్ విద్యార్థి చరణ్ బంగారు పతకం, ఉట్నూర్ ఆదర్శ క్రీడ పాఠశాల విద్యార్థి మరుసుకోల ఇందర్‌శావు వెండి పథకం, వికారాబాద్ మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థి శ్రీనివాస్ కాంస్య పథకం 17ఏళ్ల బాలుర విభాగం వంద మీటర్ల పరుగు పందెంలో మహాబూబ్‌నగర్‌జిల్లా మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థి శివప్రసాద్ బంగారు పతకం, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ చిలుకూరు గురుకుల విద్యార్థి రాజేశ్ వెండి పతకం, జాతర్ల ఆదర్శ క్రీడ పాఠశాల విద్యార్థి నైనిశ్రీకాంత్ కాంస్య పతకం, 17ఏళ్ల బాలుర 800 మీటర్ల పరుగు పందెంలో మహాబూబ్‌నగర్ మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థి బసంత్ బంగారు పతకం, జేపీ నగర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థి సంతోష్‌వెండి పతకం, జాతర్ల ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి పంద్రం సురేష్ కాంస్య పథకం, 17 ఏళ్ల బాలుర విభాగం హైజంప్‌లో జాతర్ల క్రీడా పాఠశాల విద్యార్థి బంగారు పతకం, మహాబూబ్‌నగర్ జ్యోతిబాపూలే విద్యార్థి మురళీకృష్ణ వెండి పతకం, జాతర్ల క్రీడా పాఠశాల విద్యార్థి రాజేశ్‌కాంస్య పతకం, 19ఏళ్ల బాలుర 100 మీటర్ల రన్నింగ్‌లో సాంఘీక సంక్షేమ లింగట్ల విద్యార్థి గణేష్ బంగారు పతకం, మహాత్మాజ్యోతిబాపూలే సికింద్రబాద్ విద్యార్థి రాజు వెండి పతకం, జైపూర్ సాంఘీక సంక్షేమ విద్యార్థి రాజ్‌కుమార్‌కాంస్య పథకం, 19 బాలుర 800 మీటర్ల పరుగు పందెంలో మెదక్ విద్యార్థి సంతోష్ బంగారు పతకం, లింగట్ల విద్యార్థి భాను ప్రసాద్ వెండి పతకం, బాలానగర్ విద్యార్థి శ్రీశైలం కాంస్య పతకం, 14 జిల్లా బాలికల విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో చేవెళ్లకు చెందిన వైష్ణవి బంగారుపతకం, మెదక్‌కు చెందిన దివ్య వెండి పథకం, ఆసిపాబాద్‌కు చెందిన శైలజ కాంస్య పతకం, 14ఏళ్ల 600 మీటర్ల పరుగు పందెంలో ఆసిఫాబాద్‌కు చెందిన చిన్నుబాయి బంగారు పతకం, ఉప్పల్‌కు చెందిన తేజశ్రీ వెండి పతకం, ఆదిలాబాద్‌కు చెందిన అలేక్య కాంస్య పథకం, 14ఏళ్ల బాలికల షాట్‌పుట్‌లో వరంగల్‌తిమ్మాపూర్‌కు చెందిన సమంత బంగారు పథకం, మహాబూబ్‌నగర్‌కు చెందిన కళ్యాణివెండ పతకం, హనుమకొండ అసంపర్తికి చెందిన నికిత్స కాంస్య పథకం, 17ఏళ్ల బాలికల విభాగం 100 మీటర్ల రన్నింగ్‌లో ఆసిఫాబాద్‌కు చెందిన అంజలి బంగారు పథకం, ఆసిఫాబాద్‌కు చెందిన హారిక వెండి పథకం, మహాబూబ్‌నగర్‌కు చెందిన జ్ఞానేశ్వరి కాన్సి పథకం, 17ఏళ్ల బాలికల విభాగం 800 మీటర్ల పరుగుపందెంలో వెల్దండకు చెందిన కీర్తన బంగారు పథకం, కొల్లాపూర్‌కు చెందిన మధుప్రియ వెండి పథకం, ఎల్లారెడ్డికి చెందిననందిని కాంస్య పథకం, 17ఏళ్ల బాలికల హైజంప్‌లో సంచర్లకు చెందిన లావణ్య బంగారు పథకం, నిజామాబాద్‌కు చెందిన ఉమామహేశ్వరి వెండి పథకం, హనస్పర్తికి చెందిన హారిచందన కాంస్య పథకం, బాలికల 19 ఏళ్ల 100 మీటర్ల పరుగు పందెంలో గుండ్లపల్లి దిండికి చెందిన శైలజ బంగారు పథకం, భద్రాచలంకు చెందినశ్రీతేజ వెండి పథకం, గుండ్లపల్లి దిండికి చెందిన శృతికాంస్య పథకం, 19 బాలికల విభాగం 800 మీటర్ల పరుగు పందెంలో గుండ్లపల్లి దేనికి చెందిన అఖిల బంగారు పథకం, జడ్చర్లకు చెందిన వెండి పథకం, ఎల్లారెడ్డికి చెందిన లకావత్ అఖిల కాంస్య పథకం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు డీడీ దిలీప్‌కుమార్, చందన, రమాదవేవి, డీటీడీఓ మడావి గంగారం, సారంగపాణి తదితరులు మెడల్స్ అందించారు.



కబడ్డీలో తలపడుతున్న ఇరుజట్ల క్రీడాకారులు



అర్చరీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



విజేతలకు మెడల్స్ అందిస్తున్న అధికారులు

'శాంతియుతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవాలి'

ఉట్నూర్, జనవరి 18: ఈనెల 22న అయోధ్య రామ మందిరంలో విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతున్నందున అన్ని గ్రామాలలో ప్రజలు శాంతియుతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద హిందు సంఘాల ముఖ్యు లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉట్నూర్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాలలో కూడా శాంతియుతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు.ఎలాంటి ఆలోచనయ సంఘటనలకు చోటు ఇవ్వకుండా ఎక్కడి వారు అక్కడే కార్యక్రమాలుఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, హిందు ఉత్సవ సమితి నాయకులు సాడిగే రాజగోపాల్, భీమన్న, పోచన్న, సౌకారి రామిని, నాగన్న, రాజశేఖర్, సాడిగే రాజేశ్వర్, కొండగట్టు అంజన్న, బింగి వెంకటేశ్, లింగన్న, కొండేరి రమేష్‌లు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్ కోటి, నిపానీ, దన్నోరా గ్రామాలలో భీంపూర్ పోలీసుల అధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో శాంతి సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్టన ఉన్నందున ఎవరి మనోబావాలు దెబ్బతినకుండా శాంతి యుతంగా జరుపుకోవాలని అందరూ కలిసి కట్టుగా ఉండాలని ఎస్సై లాల్ సింగ్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కెమ గంగయ్య, కెమ రాజన్న, బక్కి అజయ్, గ్రామ పెద్దలు దాసరి రమేష్, మార్సెటి అనిల్, ముకుందా సంతోష్, పోలీస్ సిబ్బంది ఏఎస్సైలు ముంతాజ్ అహ్మద్, సామి, హెడ్ కానిస్టేబుల్ శివాజీ, కానిస్టేబుల్‌లు రాందాస్, గేడెం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

● బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు విజేత

ఆర్మూర్ రూరల్, జనవరి 18: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి సాంఘీక సంక్షేమ విద్యా సంస్థ ప్రాంతీయ అధికారిణి అలివేలు హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలలో రాణించి తెలంగాణ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమేనని, గెలుపొందిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, ఓటమి చెందిన క్రీడాకారులు గెలుపు కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు మాట్లాడుతూ వచ్చేనెల 3వ తేదీన చత్తీష్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ జిల్లా క్రీడాకారులు క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషకరమన్నారు. అంతేకాకుండా పోటీలలో బాలికల విభాగంలో నిజామాబాద జట్టు ప్రథమ స్థానంలో నిలవగా మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం, కరీంనగర్ 3వ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, మెదక్ జట్టు ద్వితీయ స్థానంలో, నిజామాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, గంగామోహన్, టోర్నీ ఆర్గనైజింగ్ మల్లేష్‌గౌడ్, యునిస్‌పాషా, నాగరాజు, సుద్దపల్లి, వేల్పూర్ పాఠశాలల ప్రిన్సిపాల్ గోదావరి, స్వప్న, వ్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీ

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీ సోయం

నేరడిగొండ, జనవరి 18: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. మండలంలోని రోల్‌మామడ గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు. నవభారత్ నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల పై అధికారులు ద్వారా అవగాహన కల్పించారు. బీమా ఆరోగ్య కార్యక్రమాలపై సంబంధిత అధికారులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు మోదీ సందేశాన్ని వీడియోలో ప్రజలకు వినిపించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ, బీజేపీ జిల్లా నాయకులు గొర్ల రాజుయాదవ్, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణసింగ్, పార్టీ మండల కన్వీనర్ సోనయ్య హీరాసింగ్, బీజేపీ నాయకులు శంకర్, శేఖర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

● జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు : ఆర్డీవో

తలమడుగు, జనవరి 18: వాహనదారులు ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రోడ్డు రవాణా సంస్థ ఆర్టీవో అధికారి రామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసినఅవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా వాహనదారులు అందరికి రోడ్డు భద్రత పై అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనాలునడిపే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలు తెలిసి ఉండాలన్నారు. అంతేకాకుండా వాహనదారులు లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి ఎవరు వాహనాలు నడపవద్దన్నారు. ఇందులో తలమడుగ ఎస్సై ధనశ్రీ, ఎంపీడీఓ రమాకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఆర్టీఓ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో రోడ్డు భద్రత పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

నేరడిగొండ: రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదం నివారణ చర్యలు గురించి వివరించడడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆర్వీ కన్సల్టెన్సీ టీం లీడర్ ఎ.ప్రసన్నకుమార్, సురేంద్రబాబు, ఆలం నసీమ్, కేఎస్ఆర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సూర్యనారాయణ, ప్రాజెక్టు ఇన్‌చార్జి రాంమోహన్ రెడ్డి, పూసపత్రి వినేష్, పెట్రోలింగ్ సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్యలో రామ మందిర నిర్మాణం మోదీతోనే సాధ్యం : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 18: అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని యావత్ భారతదేశం కన్నుల పండుగల జరుపుకోనుందని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో సుందరసత్సాంగ్ పరివారం తరపున కృష్ణానంద శ్రీరామాయణంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మఠాధిపతి యోగానంద సరస్వతి, ఎంపీ సోయం బాపురావ్, ఎమ్మెల్యే పాయలశంకర్‌లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి హిందు కలలు కన్న అయోధ్యలో రామ మందిర నిర్మాణం ప్రధాని నరేంద్రమోదీతో సాధ్యమైందన్నారు. ఈ మహోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని సూచించారు.

రామ మందిర నిర్మాణానికి విరాళం

తాంసి, జనవరి 18: 2021 లో అయోధ్యలో రామ మంది నిర్మాణానికి గాను తన వంతు సహాయంగా తాంసి గ్రామానికి చెందిన ముస్లిం సోదరుడు వహీద్‌ఖాన్ రూ.5001 విరాళంగా అందజేశారు. శ్రీ రాములోరి అక్షింతల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయనను గ్రామ యవకులు ఘనంగా సన్మానించారు. అక్షింతలను కూడా ఆయనకు పంపిణీ చేశారు. హిందువులు చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ తన వంతు సహాయాన్ని అందిస్తున్న ఆయనకు గ్రామస్థులు అభినందించారు.

'మాజీ మంత్రిపై ఆరోపణలు సరికాదు'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 18: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పొగిడిన వ్యక్తి నేడు జోగురామన్న పై విమర్శించి మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్‌అజయ్ అన్నారు. మాజీ మంత్రి జోగురామన్నకు ప్రధాన అనుచరుడిగా కుటుంబంలో ఒకరిగా మెలిగిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన పార్టీలో చేరి ఆయనపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. గురువారం స్థానిక కౌన్సిలర్లు, నేతలతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మాజీ రామన్న ఆయనను అందలం ఎక్కించి డీసీసీబీ చైర్మన్ పదవి రావడంలో అత్యంత కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఇంట్లో విషాదం

నేరడిగొండ, జనవరి 18: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తమ్ముడు అంబారావు జాదవ్ గురువారం మృతి చెందడంతో అనిల్‌జాదవ్ ఇంట విషాదం నెలకొంది. కాగా, అంత్యక్రియలు రాజుర గ్రామంలో నిర్వహించగా ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

వాఘాపూర్ క్రాస్ రోడ్ వద్ద రోడ్డు ప్రమాదం

గుడిహత్నూర్, జనవరి 18: మండలంలోని వాఘాపూర్ క్రాస్ రోడ్ సమీపంలో గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇచ్చోడ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బోర్ వెల్ బండిని వెనక నుంచి వేగంగా వస్తున్న పార్శిల్ ఐచర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బోర్‌వెల్ బండి జాతీయ రహదారిపై బోల్తా పడింది. మరో వైపు డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. ఢీకొట్టిన ఐచర్ ముందు భాగం నుజ్జునుజ్జుఅయ్యింది. ఇందులో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. మరోవైపు బోల్తాపడిన బోర్‌వెల్ బండి కింద లేబర్ ఇరుక్కుపోయాడు. సంఘటన స్థలానికి ఇచ్చోడ సిఐ చంద్రశే ఖర్, ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ చేరుకున్నారు. దాదాపు గంటన్నర సేపు ఇద్దరు ఇర్కుపోయారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. స్థానికులు ఎంత ప్రయత్నించినా బయటకు రాకపోవడంతో రెండు క్రేన్‌లను రప్పించారు. ఇరుక్కున్న ఇద్దరిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. రెండు వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఐచర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



బోర్‌వెల్ బండి కింద ఇరుక్కున్న మరో వ్యక్తి



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నాన్‌బెయిలెబుల్ కేసుల పట్ల ఖండన

● సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 18: జగిత్యాలలో గత యేడాది క్రితం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదల పై పోలీసు లాఠీ చార్జీ చేయించి గుడిసెలను దహనం చేసి, పేదలు, నాయకులపై నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టి జైళ్లో పెట్టడాన్ని ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పేర్కొన్నారు. గురువారం సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవనం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60చోట్ల ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. ఈ స్థలాలను రియలిస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేయ చూస్తున్నారని, వారికి వత్తాసు పలుకుతు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పోలీసుల ద్వారా గుడిసెలు తగలబెట్టిస్తూ కేసులు నమోదు చేయిస్తున్నారని పేర్కొన్నారు. గత 3రోజుల క్రితం జగిత్యాల, కోరుట్ల పట్టణ కేంద్రాల్లో గుడిసెవాసులపై దాడి చేసి గుడిసెలకు నిప్పుపెట్టి పేదలు, సీపీఎం నాయకుల పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వక పోవడంతోనే ఓటమి పాలైం దన్న సంగతి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గమనించాలన్నారు. ఇప్పటికైనా అరెస్టు చేసిన వారిపై బేషరతుగా కేసులు ఎత్తి వేసి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు బండిదత్తాత్రి, ప్రజాపంథా నాయకులు జగన్‌సింగ్, సీపీఎం జిల్ల కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా నాయకులు బొజ్జఆశన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల, ఎన్.స్వామి, లింగాల చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి పరామర్శ

మావల, జనవరి 18: జందాపూర్ గ్రామానికి చెందిన జక్కుల స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న గురువారం జందాపూర్ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులనుకలిసి పరామర్శించారు. మృతికి గలకారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పి నచ్చజెప్పారు.

సాలెవాడ(కె) జాతరలో క్రికెట్ టోర్నమెంట్

ఉట్నూర్, జనవరి 18: మండలంలోని సాలెవాడ(కె) గ్రామంలో ప్రారంభమైన మహదేవ్ జాతరలో గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఏఎస్పై దిలీప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహదేవ్ జాతరకు వస్తున్న భక్తులకు ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని, ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వొద్దన్నారు. ప్రతీ ఆటలో గెలుపు ఓటములు సహజం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రాథోడ్ రితేష్, సాల్గారే రవీందర్, నందు, రాందాస్, శ్రీరామ్, సుందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా.. గగనమే..



● జిల్లా కేంద్రంలో స్పిన్నింగ్ మిల్లు వద్ద కొనసాగుతున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు



- జిల్లాకేంద్రంలో రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి పనుల్లో కనిపించని పురోగతి
- నత్తనడకన సాగుతున్న రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులు
- మొదటగా రూ.27.63 కోట్ల అంచనాతో అధికారుల టెండర్లు
- రూ.30 కోట్లకు పైగా అంచనాలను పెంచుతూ మళ్లీ టెండర్
- సర్వే పూర్తయినా.. స్థల సేకరణలో జాప్యం
- శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- రైల్వే శాఖ ఆధ్వర్యంలో కొంతవరకు పనులు ప్రారంభమైనా.. కన్నెత్తి చూడని ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖలు
- ఏడాది గడిచినా.. పట్టణవాసులకు తప్పని ఎదురుచూపులు

ఆదిలాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చేపట్టిన రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణ పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసినా.. అధికారుల అలసత్వంతో జాప్యం జరుగుతూ వస్తోంది. మొదట టెండర్ వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో సంవత్సరం కాలం పాటు సమయం వృథా అయ్యింది. రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి గాను మొదట రూ.27.63 కోట్ల అంచనాలతో అధికారులతో టెండర్లను పిలిచారు. ఎలాంటి స్పందన రాకపోవడంతో తిరిగి రూ.30 కోట్లకు పైగా అంచనాలను పెంచుతూ మళ్లీ టెండర్ పిలువడంతో హైదరాబాద్‌కు చెందిన సుబ్రమణ్యం కాంట్రాక్ట్ కంపెనీ పనులను చేపట్టేందుకు ఒప్పందం చేసుకుంది. దీంతో ఎట్టకేలకు టెండర్ దాఖలు కావడంతో అగ్రిమెంట్ కూడా పూర్తయ్యింది. అయినా ఆశించిన స్థాయిలో పనులు సాగడం లేదు. ఇటీవలే ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో మరింత గందరగోళ పరిస్థితుల కు దారి తీస్తోంది. గత నాలుగైదు మాసాల క్రితమే స్పినింగ్ మిల్లు వద్ద పనులు ప్రారంభమైనా.. తాంసి బస్టాండ్ వద్ద మాత్రం అడుగు ముందుకు పడినట్లే కనిపించడం లేదు. అగ్రిమెంట్లు, అనుమతుల పేరిట సంవత్సరాలు గడిస్తే పనులు ఎప్పుడు పూర్తవుతాయో? అర్థం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే రైల్వే శాఖ ఆధ్వర్యంలో కొంతవరకు పనులు ప్రారంభ మైనా.. ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖాధికారులు అటువైపు కన్నెత్తయిన చూడడం లేదంటున్నారు. అసెంబ్లి ఎన్నికలతో పనులకు కొంత వరకు ఆటంకం ఏర్పడిన ఎన్నికలు ముగిసిపోయి నెల రోజులు గడిచిపోతున్నా.. ఆశించినస్థాయిలో పనులు జరుగడం లేదు. ఆర్అండ్ బీ, మున్సిపల్ శాఖలు సొంత పనుల పైననే దృష్టి సారిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా పనులను ప్రారంభించి పూర్తి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఎన్నికలకు ముందు కొంత హడావుడి చేసినా.. ఆ తర్వాత అధికారులు పట్టించుకున్నట్లే కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమన్వయం ఏది?

జిల్లాకేంద్రంలోని స్పినింగ్ మిల్, తాంసి బస్టాండ్ వద్ద రైల్వే బ్రిడ్జిలను నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను మంజూరు చేసినా.. అధికారులు మాత్రం తాననుగుణంగా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే పలుమార్లు సర్వే పనులను పూర్తి చేసినా.. స్థల సేకరణను మాత్రం ప్రారంభించడం లేదు. తాంసి బస్టాండ్ నుంచి పంజాబ్ చౌక్ వరకు బ్రిడ్జి నిర్మాణం వెడల్పు 12.40 మీటర్లు కాగా, బీటీ రోడ్డు వెడల్పు 7.50 మీటర్ల మేర నిర్మించనున్నారు. అలాగే స్పిన్నింగ్ మిల్లు వద్ద నిర్మించే బ్రిడ్జి నిర్మాణం



వెడల్పు దాదాపుగా 11.80 మీటర్లు కాగా బీటీ రోడ్డు 14 మీటర్ల వెడల్పు చేపట్టనున్నారు. ఇరు వైపుల మురికి నీటి కాలువల నిర్మాణానికి అదనంగా స్థల సేకరణ చేయాల్సి ఉంది. గత యేడాది క్రితమే సర్వే చేపట్టి మార్కింగ్ చేసిన ఇప్పటి వరకు సంబంధిత యజమానులకు పూర్తిస్థాయిలో నోటీసులు ఇవ్వలేదని తెలుస్తుంది. కొన్నిచోట్ల స్థల సేకరణపై అభ్యంతరాలు, వివాదాలకు దారి తీసే అవకాశం కనిపిస్తుంది. అలాంటి పరిస్థితులను అంచనా వేసి ఆర్అండ్‌బి, మున్సిపల్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు ముందడుగు వేయాల్సి ఉంది. కానీ పూర్తి స్థాయిలో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులపై దృష్టి సారించడం లేదంటున్నారు. బ్రిడ్జిల నిర్మాణం తో తాంసి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో భారీగా ఆస్తి నష్టం జరిగే అవకాశం కనిపిస్తుంది. అధికారులు స్థల, ఇంటి యజమానులకు అవగాహన కల్పించి స్థల సేకరణ చేపట్టడంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. ఈ శాఖల్లోనూ అధికారుల కొరత ఉండడంతో ఆశించినస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆగుతూ.. సాగుతున్న పనులు

రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులను దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్ట్ కంపెనీ పనులను వేగవంతంగా చేపట్టడం లేదంటున్నారు. ఇప్పటికే టెండర్ అనుమతుల కోసం తీవ్ర కాలయాపన జరిగింది. ఇకనైనా పనులను వేగవంతం చేస్తే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నిర్మాణం పనులను చేపట్టేందుకు అనువైన సమయమే ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. సంబంధిత శాఖల సహకారం లేకపోవడంతోనే పనులు వేగవంతం కావడం లేదంటున్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులే ఈ రకం గా వ్యవహరించి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఈ శాఖ అధికారులే ఇతర పనులపై దృష్టి సారించడంతో మిగితా శాఖలుకూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్న అభిప్రాయా లు వ్యక్తమవుతున్నాయి. గతంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పనులను చేపట్టాలని అధికారులను ఎన్నిసార్లు హెచ్చరించినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు కనిపించ లేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసిపోవడంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పాయల శంకర్ కూడా పనులపై ప్రత్యేకదృష్టిని సారించారు. ఇందులో భాగంగానే గురువారం పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు హెచ్చరించిన సమయంలోనే కొంత హడావుడి చేస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు.. ఆ తర్వాత అసలు విషయాన్నే మరిచిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కనీసం రైల్వే శాఖ పనులు పూర్తయ్యేలోపైనా స్థల సేకరణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. స్థల సేకరణ పూర్తయితేనే ఇరువైపుల డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులను చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే స్థల సేకరణకు అడుగడుగునా ఆటంకాలే ఎదురుకావడంతో గడువులోగా రైల్వే బ్రిడ్జి పనులు పూర్తి కావడం అనుమానంగానే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం వచ్చే పార్లమెంట్ ఎన్నికల లోపైనా పనులను వేగవంతం చేస్తారా? లేదా? అనేది సందేహంగానే కనిపిస్తోంది.



రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి

: సురేష్, డీఈ, ఆర్అండ్‌బీ శాఖ

జిల్లాకేంద్రంలో ప్రారంభమైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. అనుమతులు ఆలస్యంగా రావడంతో నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఇకపై పనులను వేగవంతం చేసి గడువులోగానే పూర్తి చేస్తాం. త్వరలోనే స్థల సేకరణ పనులను కూడా ప్రారంభిస్తాం. మున్సిపల్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ముందుకెళ్తాం. ఈ వేసవిలోపు దాదాపుగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్త సమాచారం

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఉట్నూర్, జనవరి 18: తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలనే విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం కోసం దరఖాస్తులు చేసుకోవాలని గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలపారు. దీనిలో భాగంగా 2023-24 ఉద్యోగ సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న బాల బాలికలు ఎంపీసీలు 40, బైపీసీలు 40 గురుకులాల్లో చేరవచ్చని రూ.200 చెల్లించి ఆన్‌లైన్ ఫిబ్రవరి 5లోగా దరఖాస్తులు సమర్పించాల ని ఆయన పేర్కొన్నారు. మొదటి స్క్రీనింగ్ టెస్టు మార్చి 10న డిస్క్రిప్షన్ పద్ధతిలో 150 మార్కులను గాను ఎంపిక చేసి పరీక్ష కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా ఐదవ తరగతిలో ప్రవేశానికి 2024-25 విద్యాసంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. విద్యార్థులు 4వ తరగతి చదువుతున్న ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌లో ఈనెల 20లోగా సమర్పించాలన్నారు.

రేపు జైజంగు జైలింగు దీక్షలు

నేరడిగొండ, జనవరి 18: శ్రీగోపాలకృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో ఈనెల 20న మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో జైజంగు జైలింగు దీక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు మండాడి భీంరావు పటేల్, సిడాం మనోహర్, పెందూరు శంబు, సిడాం లక్ష్మణ్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం హనుమాన్ మందిరం వద్ద చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. 21 రోజుల పాటు దీక్షలు ఉంటాయని, ఆసక్తి గల వారు దీక్షలు స్వీకరించాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



భారీ లకడ్డూను తరలిస్తున్న భక్తులు

ఆదిలాబాద్ మీదుగా అయోధ్యకు 1,265 కేజీల లడ్డు

మావల, జనవరి 18: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా హైదరాబాద్ నుంచి జిల్లా మీదుగా అయోధ్యకు 1,265 కిలోల భారీ లడ్డూను తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌కు చేరుకున్న ఈ భారీ లడ్డును ప్రజల సందర్శనార్థం శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో గురువారం అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నేతలు బోండ్ల నారాయణ, బండారి సంతోష్, ఉప్పులంచి కృష్ణ, గంద్రత్ సంతోష్, శ్రీరాం శర్మ, శారద దుర్గా వాహిని, రజిని బద్దం పురుషోత్తం రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్షేత్ర పరిశీలనకు సిద్ధంగా ఉండాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం ● అధికారులతో సమీక్ష సమావేశం ● 'ప్రజాపాలన' దరఖాస్తుల డేటా నమోదు ప్రక్రియ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 18: ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్ర పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్ర పరిశీలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు, పీఎం-జన్‌మన్ పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదు ప్రక్రియ పూర్తయినందున క్షేత్ర పరిశీలనకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు పాటిస్తూ పారదర్శకంగా దరఖాస్తుల క్షేత్ర పరిశీలనచేపటవల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు లేని వారికి తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు పడక గదులు ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం, ఇతరత్రా దరఖాస్తుల పై అర్జిదారులకు రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించారు. అర్హులైన ఓటర్లను నమోదు చేయించాలని, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఓటరు నమోదు, మరణించిన, చిరునామా మార్పులు, చేర్పులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఈనెల 15న ప్రారంభించిన పీఎం-జన్‌మన్ పథకం అమలుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా పీవీటీజీ కుటుంబాలను గుర్తించి పథకంపై వివరించి ఆధార్, ఓటరు, కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు కృషి చేయాలన్నారు.

అనంతరం, స్త్రీశిశు సంక్షేమ శాఖపై కలెక్టర్ సమీక్షిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులపై ప్రత్యేకశ్రద్ధ వహించి సామ్-మామ్‌పై నిరంతరం పర్యవేక్షించాలని సీడీపీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో కిషన్, జడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్క, మున్సిపల్ కమిషనర్ శైలజ, డీడీ దిలీప్‌కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం కారణంగానే పనుల్లో అలసత్వం

● ఆర్‌వోబీ, ఆర్‌యూబీ పనులపై ఎమ్మెల్యే పాయల ఆరా

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 18: గత రాష్ట్ర ప్రభుత్వం కారణంగా రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అలసత్వం జరిగిందని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. గురువారం ట్రాక్ అవతల ఉన్న కాలనీల్లో పర్యటించి రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనుల పై ఆరా తీశారు. తాటిగూడ, భాగ్యనగర్, మహాలక్ష్మి, వడ్డెర కాలనీల్లో తిరుగుతు ప్రజలతో మాట్లాడారు. అనంతరం ట్రాక్‌పై తిరుగుతూ పనుల నిర్వహణపై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుని మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం తాంసి బస్టాండ్ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా తగ్గించేలా కృషి చేస్తున్నామన్నారు. 50 శాతం జనాభా ట్రాక్ అవతలే ఉన్నారని, రైల్వే గేటు పడిన సమయంలో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీ పనులు 2018లో పూర్తికావాల్సి ఉండగా కేంద్రం నుంచి నిధులు విడుదలైన రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం కారణంగా పనులు నిలిచి పోయి నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయని కారణంగా తాంసి బస్టాండ్ వద్ద పనులు ఆగిపోయాయన్నారు. అంతేకాకుండా తాటిగూడ, మహాలక్ష్మివాడ, భాగ్యనగర్ ప్రాంతాల నుంచి ఆదిలాబాద్‌కు వచ్చే ప్రజల కోసం మరోక 3మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తానని,ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ఫోర్ వీలర్ కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రైలు పట్టాలు దాటి అవతలి వైపు వెళ్లే వీలుంటుందన్నారు. దాదాపు 25శాతం ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. ఇప్పటికే రైల్వే క్రాసింగ్ వద్ద దాదాపు అరగంట వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని, పిట్‌లైన్ పనులు ప్రారంభమైతే ప్రతీ రోజు ఆదిలాబాద్ నుంచి 25-30 రైళ్లు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తాయన్నారు. అప్పుడు సమస్య మరింత జటిలమవుతుందని దీనికి పరిష్కారం వెంటనే చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి పరిస్థితిని వివరిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా దాదాపు 50 శాతం మంది జనాభా రైల్వే లైన్‌కు అవతలివైపు ఉన్నందున యుద్ధప్రాతిపదికన ఈ పనులు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ డీఈ సురేష్, మున్సిపల్, రైల్వే శాఖ అధికారులు, బీజేపీ నాయకులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



స్థానిక కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకుంటూ..



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఐటీడీఏ పీవోను కలిసిన గిరిజాయివాసులు

బజార్‌హత్నూర్, జనవరి 18: మండలం పరిధిలోని గిరిజన గ్రామమైన గిరిజాయి గ్రామస్థులు గురువారం ఉట్నూరులోని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయిని కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆమెకు వివరించారు. మండలకేంద్రం నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ.. నేటికి సరైన రోడ్డు సౌకర్యం లేకుండా బతుకుతున్నామన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పోడు భూములలో బోరుబావులను ఏర్పాటు చేసి రైతులను వ్యవసాయానికి జీవం పోయాలని వారు వేడుకున్నారు. కనీస సౌకర్యాలను కల్పించాలని విన్నవించగా.. వెంటనే సంబంధిత అధికారులను పంపి సమస్యలపై అధ్యయనం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కిషన్, కేశవ్, కాంగ్రెస్ నాయకురాలు ధనలక్ష్మీ, శేఖర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఉద్యానవన నర్సరీ పరిశీలన



ఉద్యాన వనాన్ని పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ వికాస్‌మెహతా

ఉట్నూర్, జనవరి 18: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఉట్నూర్ ఉద్యాన నర్సరీ(హెచ్ఎన్‌టీసీ)ని గురువారం ఆదిలాబాద్ శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మెహతా సందర్శించారు. నర్సరీలో ఉన్న మామిడి, జామ, సపోట తోటలను పరిశీలించారు. ప్రయోగాత్మకంగా సాగు చేసిన బంతి, మునగ, పసుపు, కూరగాయల పంటల సాగుతో పాటు ఉట్నూర్, బెల్లంపల్లి, జంబుగ, భీమారంలలో ఉన్న నర్సరీల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, డ్రిప్, మల్చింగ్ విధానాల గురించి వాటి ఉపయోగాల గురించి సంబంధిత శాఖ అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో సందీప్‌కుమార్, సాంకేతిక సహాయకులు కుమారి అర్షిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ మార్కెట్‌లో పరిధిలో తగ్గిన పత్తి ధర

బోథ్, జనవరి 18: బోథ్ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్‌లలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న పత్తి ధరను వంద రూపాయల మేరకు తగ్గిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న తెలిపారు. మొదట సీసీఐ పత్తిని రూ.7,120లకు క్వింటాలు కొనుగోలు చేసిందని అయితే ఇటీవల పత్తి నాణ్యత పడిపోవడంతో క్వింటాలు పత్తికి రూ.6,920కి కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్‌కు పత్తిని తీసుకురావాలని ఆయన రైతులకు సూచించారు.

● తగ్గిన పత్తి ధరతో రైతుల్లో ఆందోళన

బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగుల్లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న పత్తి ధరను రూ.100 తగ్గించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి నాణ్యత తగ్గిందని సీసీఐ అధికారులు క్వింటాలుకు రూ.వంద తగ్గించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ గురువారం సీసీఐ అధికారితో వాగ్వాదానికి దిగారు. అయితే అదే సమయంలో మార్కెటింగ్ జిల్లా అధికారి శ్రీనివాస్ బోథ్‌కు రావడంతో ధర తగ్గింపుపై రైతులు అధికారితో ధర తగ్గించడం సరైనది కాదని, ఇంకా కొంతమంది రైతులు మొదటి పత్తిని విక్రయించలేదని అకస్మాత్తుగా ధర తగ్గించడంతో నష్టపోతున్నామని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం మార్కెట్‌కి తీసుకువస్తున్న పత్తి గింజ పరిమాణం తగ్గిందని దీంతో సీసీఐ అధికారులు ధర తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారని జిల్లా మార్కెటింగ్ అధికారి పేర్కొన్నారు. ఈ విషయంలో తాము ఏమీ చేయలేమని వివరించారు. చివరకు రైతులు మార్కెటింగ్ అధికారితో మాట్లాడుతూ కొనుగోళ్లలో కోత విధించకుండా కొనుగోలు చేపట్టాలని కోరారు. పత్తిని తేమతో తీసుకురావద్దని, తేమతో తీసుకువస్తే కోత విధిస్తామని మార్కెటింగ్ అధికారి తెలిపారు. దీంతో రైతులు ఒప్పుకున్నారు.